క్లుప్తంగా

యూటీఎఫ్ నూతన కార్యవర్గం


సురేష్


శేఖర్

యాదమరి: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాయంత్రం జిల్లా నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మండల అధ్యక్షులుగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సురేష్, గౌరవ అధ్యక్షులుగా కృష్ణయ్య, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా సోమశేఖర్, లతా, ట్రెజరర్‌గా గిరిబాబు తదితరులను సభ్యులుగాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కబ్జా చేయలేదు


సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు

చిత్తూరు రూరల్: దేవుడి స్థలాన్ని, దారినీ కబ్జా చేయలేదని, కొందరు కుట్రపూరితంగా నిందలు వేస్తున్నారని రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి అరుణ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. నగరంలోని రాంనగర్‌కాలనీలో దేవుడి సొత్తు, దారి ఆక్రమించుకున్నట్లు కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తన స్థలం వరకే రిజిస్టర్ చేసుకున్నానని, ఆ రికార్డులన్నీ పక్కాగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే గుడి పేరు చెప్పి కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వేడుకగా వినాయక విగ్రహ ప్రతిష్ట



యాదమరి: మండల కేంద్రంలో కర్పగ వినాయక స్వామి ఆలయంలో అర్చక వేదపండితులు శుక్రవారం వేడుకగా విగ్రహ ప్రతిష్టను చేశారు. ఆలయంలో గతంలో నెలకొల్పిన విగ్రహం దెబ్బతినడంతో దాన్ని తొలగించారు. ఆ స్థానంలో నూతనంగా విగ్రహం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ పూజాది కార్యక్రమాల్లో గ్రామస్తులు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి, కర్పూరహారతులు పట్టారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కిరణ్


కిరణ్

చిత్తూరు రూరల్: చిత్తూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కిరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పార్వతీని రెండు రోజుల క్రితం కుప్పానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా ఉన్న కిరణ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఉదయం బాధ్యతలు స్వీకరించారు.

4 నుంచి గీతాగానం..

చిత్తూరు రూరల్: నగరంలో ఏప్రిల్ 4వ తేదీ నుంచి పదిరోజుల పాటు జరిగే ఇంటింటా గీతాగానం..గోవిందనామం నిర్వహించనున్నట్లు చిన్మయ ఆశ్రమ నిర్వాహకులు వేలు, రమేష్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. చిన్మయ ఆశ్రయం మాతాజీ శీలానందం ఏప్రిల్ 4వతేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటింటా గీతాగానం..గోవిందనామం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారన్నారు. ఆసక్తి గల భక్తులు ఇరువారంలోని ఆశ్రమాన్ని సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

నరహరిపేటలో ఆర్టీసీ బస్టాప్


నరహరిపేటలో ఆగిన వన్‌డిపో ఆర్టీసీ బస్సు

గుడిపాల: మండలంలోని నరహరిపేట వద్ద ఆర్టీసీ వన్‌డిపో బస్సులు శుక్రవారం నుంచి నరహరిపేటలో ఆగుతున్నాయి. ఇంతకు మునుపు చిత్తూరు నుంచి వేలూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులు గుడిపాలలో మాత్రమే ఆగేవి. నరహరిపేటలో బస్టాపింగ్ ఉన్నట్లయితే సుమారు 70 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఆర్టీసీ వన్‌డిపో మేనేజర్‌కు గుడిపాల ప్రజలు వినతిపత్రాన్ని అందించారు. దీంతో శుక్రవారం నుంచి చిత్తూరు వన్‌డిపోకు సంబంధించి బస్సులు ఆగుతున్నాయి.

ఉక్కపోతకు ఉపశమనం

బంగారుపాళెం: మండల కేంద్రంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజులుగా ఉక్కపోతతో అవస్థలు పడుతున్న జనం ఈ వర్షానికి కాస్త ఉపశమనం పొందారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

దూసుకెళుతున్న రహదారి

చిత్తూరు – తచ్చూరు జాతీయ రహదారి నిర్మాణం శరవేగంగా దూసుకెళుతోంది. రోడ్డుకు సంబంధించిన అభివృద్ధి పనులు చకచకా నడుస్తున్నాయి. ఇప్పటికే అనుపల్లి నుంచి ముత్తుకూరు వరకు అండర్ బ్రిడ్జి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కల్వర్టు పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. రోడ్డు విస్తరణ చివరి దశకు చేరుకుంది. ఈ రోడ్డు కోసం భూములు పోగొట్టుకున్న రైతులకు ఇవ్వాల్సిన పరిహారం వంద శాతం అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో రహదారి పనులు నిరాటంకంగా వేగంగా ముందుకెళుతున్నాయి.


బండపల్లి వద్ద చదును పనులు పూర్తయిన చిత్తూరు-తచ్చూరు రోడ్డు

- చిత్తూరు – తచ్చూరు రోడ్డు పనుల్లో వేగం
- పూర్తి కావస్తున్న అనుపల్లి–ముత్తుకూరు రోడ్డు విస్తరణ
- చురుగ్గా అండర్ బ్రిడ్జి నిర్మాణం
- ప్రారంభమైన కల్వర్టు పనులు
- వంద శాతం పరిహారం చెల్లింపుపై అధికారుల దృష్టి

చిత్తూరు రూరల్: చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారి నిర్మాణానికి 2018లో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే అప్పటి ప్రభుత్వంలో కొన్ని అడ్డంకులు రావడంతో రోడ్డు పనులు ప్రారంభించలేకపోయారు. తరువాత 2020 మార్చిలో 60 మీటర్ల వెడల్పుతో రోడ్డుకు మళ్లీ కొత్తగా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. చిత్తూరు మండలం అనుపల్లి ప్రాంతం నుంచి ముత్తుకూరు వరకు 20కి.మీ మేర సర్వే చేసి హైవే రోడ్డుకు ప్రణాళిక రూపొందించారు. ఈక్రమంలో రైతులు, భూ యజమానుల నుంచి అనేక అడ్డంకులు వచ్చి పడ్డాయి. వీటిపై రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ..రైతులను చర్చకు పిలిచి సర్దుబాటు చేసి అడ్డంకులన్నింటినీ ఓ కొలిక్కి తీసుకొచ్చారు. తరువాత పరిహార విషయంలో సమస్యలు తలెత్తాయి. దీంతో అధికారులే రైతుల వద్దకు వెళ్లి అవగాహన సదస్సులు పెట్టారు. రోడ్డు నిర్మాణంతోపాటు పరిహార చెల్లింపుపై వివరించారు. దీంతో కొంత మంది రైతులు ససేమిరా అనడంతో అధికారులకు మళ్లీ తలనొప్పి మొదలైంది. అయినా పట్టు వీడకుండా ఆ రైతులను మెప్పించి.. ఒప్పించారు. దీంతో మండలంలో వంద శాతం రోడ్డుకు భూ సేకరణ పనులు పూర్తయయ్యాయి. 20 కి.మీ మేర 200 ఎకరాల భూమిని 768 మంది రైతుల నుంచి సేకరించారు. ఇందులో 25 బోర్లు, 10 బావులు ఉన్నట్లు గుర్తించారు. పొలాల మీదుగా ఉన్న మామిడి, కొబ్బరి, వేప, టేకు, చింత చెట్లను కూడా భూసేకరణలో చేర్చి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు గాను 2022 మార్చిలో తొలుత భూములకు మాత్రం నిధులు జమ అయ్యాయి. తొలి విడతగా 574 మంది రైతులకు రూ.29 కోట్లు రైతు ఖాతాలకు వచ్చి పడ్డాయి. రెండో విడతగా 85 మంది రైతులకు రూ.3 కోట్ల వరకు నిధులు చేరాయి. ఇక మిగిలింది.. కోర్టు కేసులు, భూ సమస్యలకు సంబంధించిన ఫైళ్లు మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. వాటిని కూడా వీలైనంత త్వరగా లెక్క తేల్చే పనిలో పడ్డారు. అధికారుల ఆదేశాలతో వంద శాతం రోడ్డుకు అడ్డంకులు లేకుండా చూడాలనే ప్రయత్నంలో ఉన్నారు. త్వరితగతిన వాటిని కూడా పూర్తి చేసి చిత్తూరు–తచ్చూరు రోడ్డు పనులను పూర్తి చేసేందుకు అధికారులు తలమునకలైఉన్నారు.


బండపల్లి-గువ్వకల్లు మార్గంలో నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జి

వేగంగా విస్తరణ

గతేడాదిలో అనుపల్లి నుంచి ముత్తుకూరు వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. తొలుత నత్తనడకన సాగిన పనులు.. ఇప్పుడు వేగం పుంజుకున్నాయి. చెరువు కాలువలు, రోడ్డు, జనం రాకపోకలు ఉన్న ప్రాంతాల మినహా మిగిలిన చోట చదును చేసే పనులు పూర్తయ్యాయి. మండల సరిహద్దు ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకు 60 మీటర్ల దూరం చదును చేయడంతోపాటు మట్టి తరలించి సరిచేశారు. దీంతో రోడ్డు నిర్మాణం ప్రారంభం ఓ కొలిక్కి వచ్చింది. ఇక అనుపల్లి నుంచి ముత్తుకూరు వరకు అండర్ బ్రిడ్జి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ మార్గంలో అడవి నుంచి చెరువులకు, కుంటల నుంచి చెరువులకు వెళ్లే కాలువలు 18 వరకూ ఉన్నట్లు హైవే అధికారులు గుర్తించారు. ప్రణాళిక ప్రకారం ఆయా ప్రాంతాల్లో కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. మొత్తానికి రోడ్డు పనులు చకచక జరుగుతున్నాయి. అధికారులు రహదారి పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ, పనుల్లో వేగాన్ని పెంచుతున్నారు.

అధికారుల కృషితోనే..



చిత్తూరు–తచ్చూరు రోడ్డు పనుల్లో వేగం పుంజుకోవడానికి ముఖ్య కారణం అధికార యంత్రాంగం కృషి. జిల్లా, మండల స్థాయి అధికారులు సమష్టిగా పనిచేయడం వల్లే ఇది సాధ్యపడింది. పనులు జోరందుకున్నాయి. బిల్లుల జమ కూడా 90 శాతం పూర్తయింది. బిల్లుల చెల్లింపు విషయంలో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన 10 శాతం సమస్యలను కూడా త్వరితగతిన పూర్తి చేస్తాం.

– రేణుక, ఆర్డీఓ, చిత్తూరు

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

చిత్తూరు రూరల్: నగరంలోని రాములుగుడివీధిలో ఉన్న జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో ఉచిత సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ప్రారంభమైన రంజాన్ దీక్షలు


సైరన్‌ను ప్రారంభిస్తున్న అధికారి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలు చేపట్టి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగర శేషాపీరన్ మసీదులో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి సైరన్ ప్రారంభించారు. ముస్లిం సోదరులకు సహర్, ఇఫ్తార్ సమయంలో మేలుకొలిపేందుకు ఈ సైరన్‌ను ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్‌ఖాన్, అబ్బాస్, అల్లాఉద్దీన్, హర్షద్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

పూతలపట్టు: జగనన్న కాలనీలోని గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆర్డీఓ రేణుక అధికారులను ఆదేశించారు. మండలంలోని పక్కాలగుట్ట లేఅవుట్‌లను శుక్రవారం ఆమె పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఇళ్ల పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను తహసీల్దార్ విజయభాస్కర్ పరిశీలించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


మామిడి పూతను పరిశీలిస్తున్న అధికారులు

ఐరాల: మామిడి, వరి, వేరుశనగ పంటలను సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్ర అధికారులు ఏడీఏ నాగపద్మిని, ఏఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మండలంలోని ఎం.పైపల్లె ఆర్బీకే పరిధిలో రైతులు సాగు చేస్తున్న వరి, వేరుశనగ, మామిడి పంటలను శుక్రవారం వారు పరిశీలించారు. వరిలో ఆకుముడత పురుగును గుర్తించారు. ఈ పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మామిడిలో తేనె మంచు పురుగు ఇమిడాక్లోప్రిడ్ మందును 0.3 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏవో వరలక్ష్మి, వీఏఏ హేమంత్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

చిత్తూరు రూరల్: విద్యే భవిష్యత్‌కు నిధి అని డీఈఓ విజేంద్రరావు అన్నారు. మండలంలోని బంగారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పరీక్ష సమయంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించేలా ప్రయత్నించాలన్నారు. గతేడాది మంచి మార్కులతో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ సెల్వరాజ్, బీఎస్‌ఆర్‌పేట ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలి

ఐరాల: విద్యార్థులు క్రమ శిక్షణతో లక్ష్యసాధన దిశగా కృషి చేసి, ఉజ్వల భవిష్యత్తును పొందాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవంతో పాటు పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలన్నారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 నగదు ప్రోత్సాహకం, రైటింగ్ ప్యాడ్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఢిల్లీప్రతాప్ పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌రెడ్డి, ధనచంద్రరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.




చిత్తూరు: మాట్లాడుతున్న డీఈఓ, ఐరాల: నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, బంగారుపాళెం: విద్యార్థినుల నృత్య ప్రదర్శన

విద్యతోనే సమాజం అభివృద్ధి

బంగారుపాళెం: విద్యతోనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని మంగళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లలిత అన్నారు. మండలంలోని మంగళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆవరణలో సర్వతీ విగ్రహానికి పూజలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

పూతలపట్టు: మండలంలోని పోలవరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని హెచ్‌ఎం సూర్యప్రకాష్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీటీసీ క్రిష్ణమ్మ, సురేంద్రనాయుడు, సర్పంచ్ నిర్మలమ్మ, నిరంజన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జ్ఞానశేఖర్, జలరాణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బంగారుపాళెం: పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమ అన్నారు. మండలంలోని బొమ్మాయిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణపక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ పిల్లలకు పోషక పదార్థాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని అందజేయనున్నట్లు చెప్పారు. సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారికి పౌష్టిక ఆహారాన్ని సక్రమంగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గర్భవతులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అరగొండ పంచాయతీ సర్పంచ్ మల్లుదొరై తెలిపారు. మండలంలోని అరగొండ పంచాయతీలోని అంగన్‌వాడీ వర్కర్లు శుక్రవారం 'పోషణ పక్వాడా' కార్యక్రమం నిర్వహించారు. రుధాన్యాలతో తయారు చేసిన పిండి వంటలు, తాజా ఆకుకూరలు, కూరగాయలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మల్లుదొరై మాట్లాడుతూ గర్భవతులు ఆరోగ్యంగా ఉంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. గర్భవతులు, తల్లులు, బాలింతలు మంచి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రశాంతకుమార్, గర్భవతులు, బాలింతలు , కిషోరబాలికలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ హేమ

గైర్హాజరైన వారిపై చర్యలు తప్పవు


తనిఖీ చేస్తున్న జెడ్పీసీఈఓ ప్రభాకర్‌రెడ్డి

బంగారుపాళెం: గ్రామ సచివాలయాలకు సకాలంలో విధులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో పలు రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. గృహనిర్మాణ పనులను ప్రగతిని వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నగర కమిషనర్ అరుణ హౌసింగ్, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. ఆమె శుక్రవారం ఉదయం నగరపాలక పరిధిలోని అనుపల్లి హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించారు. లేఔట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం హౌసింగ్, సూపర్‌వైజర్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.

పకడ్బందీగా డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ

నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ అరుణ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఆమె 48వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. ఎం.ఎస్.ఆర్ కూడలి వద్ద మురుగునీటి కాలువలు, కల్వర్టులను పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించడం, కల్వర్టు మరమ్మతులు, ఇతర పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ, రోజువారీ విధుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, వార్డ్ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణాల పరిశీలనలో కమిషనర్ అరుణ

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

- ఘనంగా క్షయ నివారణ దినోత్సవం
- అన్ని మండలాల్లో వైద్య సిబ్బంది ర్యాలీలు

చిత్తూరు రూరల్: జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దుదామని నగర మేయర్ అముద పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి మేయర్‌తోపాటు డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్, డీఎంహెచ్‌ఓ జి ప్రకాశం, జిల్లా క్షయ నివారణ అధికారి రవిరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత నర్సింగ్ విద్యార్థులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి సమావేశ మందిరంలో అధికారులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల అవగాహన అవసరమన్నారు. తొలి దశలోనే గుర్తిస్తే నయం చేసుకోవచ్చన్నారు. క్షయ లక్షణాలుంటే దగ్గరలోని పీహెచ్‌సీలకు వెళ్లి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. క్షయ నిర్ధారణ అయితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలందిస్తారని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందుతోందని తెలిపారు. అనంతరం కొంత మంది బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు రమేష్‌రెడ్డి, రవికుమార్, సంతోష్ పాల్గొన్నారు.

బీఎస్‌ఆర్‌పేటలో...

చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేట పీహెచ్‌సీ సిబ్బంది, అధికారులు శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్య బృందం ఇంటింటికీ వెళ్లి క్షయ లక్షణాలు, అనర్థాలను వివరించారు.


చిత్తూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న నగర మేయర్ అముద, వైద్యాధికారులు, విద్యార్థులు


పూతలపట్టు : క్షయ రోగికి కిట్‌ను అందిస్తున్న డాక్టర్ ప్రవీణ

క్షయవ్యాధిపై అవగాహన

గుడిపాల: మండల కేంద్రంలో శుక్రవారం క్షయనివారణ దినోత్సవ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రాథమిక వైద్యాధికారి కఠారి కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రెండువారాల మించి దగ్గు, ఛాతి నొప్పి, గల్లలో రక్తము, ఆకలిలేకపోవడం, బరువు తగ్గడం లక్షణాలు కనిపించినట్లయితే ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొందాలని చెప్పారు. సూపర్‌వైజర్ హేమలత, విజయ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

ఐరాల: క్షయ నివారణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత అన్నారు. శుక్రవారం వరల్డ్ టీబీ డే సందర్భంగా పీహెచ్‌సీ నుంచి మండల కేంద్రంలోని పుర వీధుల్లో అవును మనం క్షయ వ్యాధి అంతం చేయవచ్చు అనే నినాదంతో అవగాహన ర్యాలీ చేపట్టారు. క్షయ లక్షణాలు, వైద్య సేవలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణవతి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

పూతలపట్టు: క్షణ వ్యాధి పట్ల మండల ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్షయ నివారణ కరపత్రాన్ని ఇంటింటికీ అందజేశారు. వైద్యాధికారి ప్రియాంక, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చికిత్సతో క్షయవ్యాధి దూరం

బంగారుపాళెం: క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడం ద్వారా క్షయవ్యాధి దూరం అవుతుందని స్థానిక వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది, క్షయనివారణ కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు నినాదాలతో, కరపత్రాలను పంపిణీ చేస్తూ ర్యాలీ చేట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి క్షయవ్యాధి నిర్మూలపై ప్రతిజ్ఞ చేశారు. టీబీ సూపర్ వైజర్ శివకుమార్‌తోపాటు వైద్యులు అశ్విని, భారతి, డీపీఎంఓ మణి, ప్రకాష్, ఐసీటీసీ కౌన్సిలర్ బాబు, హెల్త్ సూపర్‌వైజరు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎస్టీగురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి

తవణంపల్లె: క్షయ వ్యాధి నివారణకు అందరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి ధాత్రేయచౌదరి తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తవణంపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు అమరావతి, రాజశేఖర్, హరి, జయమ్మ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


గుడిపాల: క్షయవ్యాధిపై వైద్య సిబ్బంది ర్యాలీ


ఐరాల : ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది


తవణంపల్లె: ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు


బంగారుపాళెం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది